
సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)
బుధవారం | 14 | జూన్ | 2023



ఉత్సవం.. ఉత్సాహం..
తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 20వ తేదీన ఉమ్మడి వరంగల్ జిల్లాలో విద్యాదినోత్సవం నిర్వహించనున్నారు. - 8లో▸



మార్పును ప్రారంభిద్దాం
తెలంగాణను కాపాడుకునేందుకు అందరం ఒకేతాటిపై పని చేసి, మార్పును వర్ధన్నపేట నుంచే ప్రారంభిద్దామని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం పిలుపునిచ్చారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$41^0/30^0$

వాతావరణం
జిల్లాలో వాతావరణం ఉదయం నుంచి వేడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతీవ్రత ఉండి, వడగాలులు వీస్తాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నిట్‌లో ఆదివాసీ విద్యార్థులకు శిక్షణ



కాజీపేట అర్బన్ : నిట్ వరంగల్‌లో ఆదివాసీ విద్యార్థులకు వృత్తి నైపుణ్యత శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఇంప్రూవింగ్ లాజిక్ బిల్డింగ్ స్కిల్స్ ఫర్ ఆదివాసీ స్టూడెంట్స్ పేరుతో 130 మందికి గవర్నర్ ప్రత్యేక నిధులతో శిక్షణ ఇస్తున్నారు. లాజిక్ బిల్డింగ్ స్కిల్స్‌లో భాగంగా రోబోటిక్స్ డిజైనింగ్, చేర్యాల పెయింటింగ్, యోగా, ఇంగ్లిష్‌లో మెళకువలు నేర్పిస్తున్నారు. నిట్ క్యాంపస్, ల్యాబ్స్‌ను సందర్శించారు. ట్రైబల్ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ ఆదిలాబాద్, వైరా, అచ్చంపేట, జైనూర్, ఆసిఫాబాద్ పాఠశాలల్లోని గిరిజన విద్యార్థులు పాల్గొన్నారు. ఈనెల 17న గవర్నర్‌ను ఆదివాసీ విద్యార్థులు కలువనున్నారు. కార్యక్రమంలో నిట్ ప్రొఫెసర్లు రవికుమార్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వేయిస్తంభాల ఆలయ ఆదాయం రూ.8,30,193



హన్మకొండ కల్చరల్ : చారిత్రక వేయిస్తంభాల దేవాలయంలో మంగళవారం హుండీ లెక్కించారు. హుండీల నుంచి రూ.5,12,843, పూజా రుసుముల ద్వారా రూ.3,17,350 వచ్చాయని, మొత్తం రెండు నెలల ఆదాయం రూ.8,30,193గా నమోదైందని ఈఓ కె.వెంకటయ్య తెలిపారు. పరకాల డివిజన్ దేవాదాయ పరిశీలకుడు డి.అనిల్‌కుమార్ పర్యవేక్షణలో హుండీ లెక్కింపు నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ, సిబ్బంది, శ్రీవేంకటేశ్వరసేవా సమితి బాధ్యులు పాల్గొన్నారు.

భద్రకాళి ఆలయ హుండీ ఆదాయం రూ.52,54,552

హన్మకొండ కల్చరల్ : భద్రకాళి దేవాలయంలో మంగళవారం హుండీని లెక్కించగా రూ.52,54,552 ఆదాయం వచ్చింది. 347 యూఎస్ డాలర్లు, 10 ఆస్ట్రేలియన్ డాలర్లు, 10 సింగపూర్ డాలర్లు లభించాయని ఈఓ శేషుభారతి తెలిపారు. వీటిని బ్యాంకులో జమ చేసినట్లు ఆమె పేర్కొన్నారు. పర్యవేక్షణాధికారిగా దేవాదాయశాఖ పరిశీలకుడు జి.సంజీవరెడ్డి వ్యవహరించారు. ప్రధానార్చకుడు భద్రకాళి శేషు, ఆలయ సిబ్బంది, శ్రీలక్ష్మీవెంకటేశ్వర సేవాసమితి భక్తులు పాల్గొన్నారు.


ఇంటర్ ఫస్టియర్ పరీక్షకు 441మంది గైర్హాజరు

విద్యారణ్యపురి : హనుమకొండ జిల్లాలో మంగళవారం నిర్వహించిన ఇంటర్ ఫస్టియర్ పరీక్షకు 441 మంది, మధ్యాహ్నం నిర్వహించిన సెకండియర్ పరీక్షకు 67 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఐఈవో ఎ గోపాల్ తెలిపారు. ఇంటర్ ఫస్టియర్‌లో 4,800 మందికి 4,359 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. సెకండియర్ పరీక్షల్లో 301 మందికి 234 మంది హాజరయ్యారని గోపాల్ తెలిపారు.

ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ చైర్మన్‌గా శ్రీధర్‌కుమార్‌లోథ్

కేయూ క్యాంపస్ : తెలంగాణలోని ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ చైర్మన్‌గా కేయూకు చెందిన డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్ ఎన్నికయ్యారు. వివిధ యూనివర్సిటీల కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ సమావేశం జూమ్ పద్ధతిలో మంగళవారం నిర్వహించినట్లు శ్రీధర్‌కుమార్‌లోథ్ తెలిపారు. వర్కింగ్ చైర్మన్‌గా డాక్టర్ రామేశ్వర్‌రావు (ఓయూ), ఉమెన్ చైర్మన్‌గా పల్లా రేష్మారెడ్డి (ఓయూ), కన్వీనర్‌గా రాజేష్‌ఖన్నా (జేఎన్‌టీయూ) ఎన్నికయ్యారని ఆయన పేర్కొన్నారు. కేయూకు చెందిన పలువురు కాంట్రాక్టు అధ్యాపకులకు కూడా పదవులు లభించినట్లు తెలిపారు.

ఈసెట్‌లో చరణ్‌తేజారెడ్డికి ఐదో ర్యాంకు



హసన్‌పర్తి : ఈసెట్ ఫలితాల్లో గంటూరుపల్లికి చెందిన కడిపికొండ చరణ్‌తేజారెడ్డి రాష్ట్రస్థాయిలో ఐదో ర్యాంకు సాధించినట్లు విద్యార్థి తండ్రి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. 200 మార్కులకు 149 మార్కులు సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల చరణ్‌తేజారెడ్డి సివిల్ ఇంజినీరింగ్‌లో డిప్లొమా చేసినట్లు శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు.

5వేల మందితో యువ నేతాజీ ఫౌండేషన్



వరంగల్ నగరానికి చెందిన యువ నేతాజీ ఫౌండేషన్ రక్తదానం ప్రాధాన్యతను తెలుపుతూ.. ఆపదలో ఉన్న వారికి స్వచ్ఛందంగా రక్తదానం చేస్తూ ముందుకు సాగుతోంది. ఈ ఫౌండేషన్‌కు కొత్తకొండ అరుణ్‌కుమార్ అధ్యక్షుడిగా కొనసాగుతుండగా ఇందులో 5వేల మంది సభ్యులుగా ఉన్నారు. ఇప్పటివరకు 35వరకు క్యాంపులు నిర్వహించి రక్తం సేకరించి తలసేమియా బాధిత పిల్లలకు రక్తం అందించారు. వీరి సేవలకుగాను మూడు అవార్డులు కూడా వచ్చాయి. గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ చేతులమీదుగా బెస్ట్ బ్లడ్ మోటివేటర్ అవార్డు కూడా అందుకున్నారు. వీరి ఫౌండేషన్ నిర్వహణలో 25 వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటుచేసి ఆపదలో ఉన్న వారికి అవసరమైన రక్తం అందిస్తూ ప్రాణాలు కాపాడుతున్నారు. బుధవారం ఎంజీఎం బ్లడ్‌సెంటర్‌లో ప్రత్యేక క్యాంప్ ఏర్పాటు చేశారు.

రక్తదాన చైతన్య యుద్ధంలో నేను సైతం..



ఆయన వృత్తి పోలీస్ కానిస్టేబుల్.. ప్రవృత్తి రక్తదానం.. దాతలను ప్రోత్సహించడం. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న వరంగల్ జిల్లా, ఖానాపురం మండలం, రాగంపేట గ్రామానికి చెందిన కన్నె రాజు (స్విమ్మర్ రాజు) కాలేజీ రోజులనుంచి రక్తదానం చేస్తున్నారు. 2005నుంచి ఇప్పటివరకు 31సార్లు (ఓ పాజిటివ్) రక్తదానం చేశారు. ఇప్పుడు నేతాజీ ఫౌండేషన్‌లో బ్లడ్ మోటివేటర్‌గా పనిచేస్తూ ఎంతోమందికి రక్తదానంపై అవగాహన కల్పించారు. సామాజిక మాధ్యమాల ద్వారా 85,000 మందికిపైగా యువతకు అవగాహన కల్పించారు.

రక్తదానంలో రా'రాజు'



జనగామ పట్టణం ధర్మకంచకు చెందిన మల్లిగారి రాజు ఇప్పటివరకు 86 సార్లు రక్తదానం చేసి తనలోని మానవత్వాన్ని చాటుకున్నారు. 1997లో తన మేనమామ ఇర్సం కిషన్ రైలు ప్రమాదంలో చేయి పోగొట్టుకొని అత్యవసర సమయంలో రక్తం అందుబాటులో లేక చనిపోయాడు. దీంతో కలత చెందిన రాజు మరొకరికి ఇలాంటి పరిస్థితి రావొద్దని నాటిమంచి నేటి వరకు ఏడాదికి నాలుగు సార్లు రక్తదానం చేస్తూ, పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. వరంగల్, హైదరాబాద్ ఇలా ఎక్కడికి వెళ్లినా సొంత డబ్బులు ఖర్చు చేసుకొని రక్తదానం చేయడం అలవాటుగా మార్చుకున్నారు.

ఈ ఏడాది నినాదం ఏమిటంటే..	నేడు (14 జూన్ 2023న) జరుపుకునే ప్రపంచ రక్తదాతల దినోత్సవ ప్రచార నినాదం	‘రక్తం ఇవ్వండి.. ప్లాస్మా ఇవ్వండి.. జీవితాన్ని పంచుకోండి.. తరచూ పంచుకోండి.’	..ఇది ప్రపంచ ఆరోగ్యసంస్థ ప్రకటించింది.

రక్తం ఇవ్వండి.. జీవితాన్ని పంచుకోండి



- రక్తదాన ప్రాధాన్యతను గుర్తుచేసిన బాలాసోర్ రైలు ప్రమాదం
- స్వచ్ఛందంగా తరలివచ్చిన యువకులు, గ్రామస్తులు
- ఇదే స్ఫూర్తితో ఉమ్మడి జిల్లాలో వేలాదిమంది రక్తదాతలు
- సామాజిక మాధ్యమాల ద్వారా సమాచార మార్పిడి
- నేడు ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల రక్తదాన శిబిరాలు
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం

వరంగల్ డెస్క్: రక్తదానం.. ప్రాణదానం ఒక్కటే. ఆపదలో ఉన్న వ్యక్తిని ఆదుకునేది రక్తం ఒక్కటే. ఏదైనా ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి తక్షణ అవసరం రక్తం. అదే సకాలంలో అందితే మనిషి ప్రాణాపాయం నుంచి బయటపడతాడు. ఏ మాత్రం ఆలస్యం చేసినా నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోతాయి. ఇక.. రక్తమార్పిడిపై ఆధారపడిన రోగుల జీవన నాణ్యతను మార్చేది సురక్షితమైన రక్తం. ఇలాంటి వారికి సహాయపడడానికి ఆరోగ్యంగా ఉన్న వ్యక్తులు క్రమంతప్పకుండా.. సురక్షితంగా.. సాధ్యమైనప్పుడల్లా రక్తదానం చేయొచ్చు. రక్తదానంపై ఉన్న ఎన్నో అపోహలను తొలగించేందుకు అనేక స్వచ్ఛంద సంస్థలు, అధికార యంత్రాంగం, వైద్యారోగ్యశాఖలు పలు కార్యక్రమాలు చేపడుతున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పలుచోట్ల స్వచ్ఛంద సంస్థలు, వైద్యారోగ్యశాఖలు బుధవారం వేర్వేరుగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నాయి. నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా పదులసార్లు రక్తదానం చేసిన, ఇతరులను ప్రోత్సహిస్తున్న దాతలపై ప్రత్యేక కథనం.

బాలాసోర్ రైలు ఘటనలో...



ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్ జిల్లా బాలాసోర్ వద్ద ఇటీవల జరిగిన ఘోర రైలు ప్రమాదంలో వందలాది మంది ప్రయాణికులు తీవ్ర రక్తస్రావాన్ని చవిచూసిన నేపథ్యంలో రక్తకొరత తీర్చేందుకు స్థానికులు, సమీప ప్రాంత ప్రజలు స్వచ్ఛందంగా ఆస్పత్రులకు తరలివచ్చి రక్తదానం చేశారు. దీనికి సంబంధించి అక్కడి అధికారిక వర్గాల ప్రకారం.. బాలాసోర్, భద్రక్, కటక్‌లో 3,000 మందికి పైగా రక్తదానం చేశారు. దీంతో చాలామంది క్షతగాత్రులకు వైద్యం అందించి ప్రాణాలు కాపాడారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరిని సమాజం అభినందనలతో ముంచెత్తింది. ఆపద వచ్చినప్పుడు ఇలాంటి స్ఫూర్తి మనందరిలో కలగాల్సిన అవసరం ఉంది.

విష్ణువర్ధన్ @ 30 సార్లు



మహబూబాబాద్ జిల్లా కేసముద్రానికి చెందిన పానుగంటి విష్ణువర్ధన్ ఇప్పటివరకు 30సార్లు రక్తదానం చేశారు. ఓ పాజిటివ్ గ్రూప్ గల విష్ణువర్ధన్ ఆపదలో ఉన్న ఎంతోమంది ప్రాణాలు కాపాడడంలో తనవంతు సాయం అందించారు. కాలేజీ చదివే రోజుల్లో మొదటిసారి రక్తదానం చేసిన విష్ణువర్ధన్.. ఇప్పటివరకు ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం కోసం ముందుకు సాగుతున్నారు. రక్తం అవసరమైన వారు సమాచారం అందిస్తే తక్షణమే ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నానని విష్ణు 'సాక్షి'తో తెలిపారు.

ప్రదీప్ @ 42సార్లు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూపాలపల్లి మండలం దూదేకులపల్లి గ్రామానికి చెందిన గుమ్మడి ప్రదీప్ 2006 సంవత్సరం నుంచి ఇప్పటివరకు 42 సార్లు రక్తదానం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారు ఫోన్ చేస్తే చాలు ఎంతదూరమైనా వెళ్లి రక్తం ఇచ్చి వస్తుంటారు. దీంతోపాటు వివిధ సందర్భాల్లో ఏర్పాటుచేసే రక్తదాన శిబిరాల్లో స్వచ్ఛందంగా వెళ్లి రక్తదానం చేస్తుంటారు. తలసేమియా బాధితులకు రక్తం ఎంతో అవసరమని, తనది వారికి ఉపయోగపడితే ఎంతో సంతోషంగా ఉంటుందని ప్రదీప్ తెలుపుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో బ్లడ్ బ్యాంకులు ఇలా..



ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్‌వి కలిపి 15 బ్లడ్‌బ్యాంకులు ఉన్నాయి. గ్రేటర్ వరంగల్ నగరంలో 8 ఉండగా, మహబూబాబాద్‌లో 3, నర్సంపేట, వర్ధన్నపేటలలో ఒక్కోటి, భూపాలపల్లిలో ఒకటి, ములుగులో ఒకటి ఉన్నాయి. ఉమ్మడి జిల్లా జనాభాకు ఇవి సరిపోవడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. వీటికి ఆయా స్వచ్ఛంద సంస్థలు, పోలీస్, ఇతర శాఖలు ఏర్పాటుచేసే రక్తదాన శిబిరాల ద్వారా రక్తం సమకూరుతుంటుంది.

అరుదైన ఓ నెగెటివ్ బ్లడ్ దాత



గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ ధర్మారానికి చెందిన హెడ్‌కానిస్టేబుల్ జి.జయరాజుది ఓ నెగెటివ్ బ్లడ్ గ్రూప్. ఇది చాలా అరుదు. 1990లో హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మైదానంలో దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ బహిరంగ సభ ఉండగా ఆయన బ్లడ్ గ్రూపు ఓ నెగెటివ్ కలిగిన జయరాజును ముందు జాగ్రత్తగా వేదిక పక్కన అంబులెన్స్‌లో సిద్ధంగా ఉంచారు. తన 34 ఏళ్ల సర్వీసులో 32 సార్లు రక్తదానం చేసి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

'నాయిని'వి ఎన్నికల జిమ్మిక్కులు

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్

హన్మకొండ : కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి ఎన్నికల ముందు జిమ్మిక్కులు చేస్తున్నారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తాడిశెట్టి విద్యాసాగర్, కార్పొరేటర్లు వేముల శ్రీనివాస్, సోదా కిరణ్ విమర్శించారు. హనుమకొండలోని అశోకా హోటల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికలు సమీపించగానే కొత్త అవతారం ఎత్తడం నాయిని రాజేందర్‌రెడ్డికి అలవాటు అని మండిపడ్డారు. ప్రజల కోసం పనిచేస్తున్న చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, ఆయన సోదరుడు విజయ్‌భాస్కర్‌పై ఆరోపణలు చేయడం తగదన్నారు. నాలుగున్నరేళ్లుగా కనిపించని అక్రమాలు 6 నెలల్లో ఎన్నికలుండగానే కనిపిస్తున్నాయా అని ప్రశ్నించారు. అవాస్తవమైన ఆరోపణలు, విమర్శలు చేయడం నాయినికి తగదన్నారు. ముందుగా తన పార్టీని చక్కదిద్దుకుని మాట్లాడితే బాగుంటుందని హితవు పలికారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. వినయ్‌భాస్కర్ అభ్యర్థిత్వాన్ని ముందుగానే ప్రకటించారన్నారు. జయ నర్సింగ్ స్కూల్ వెనుక ఉన్న భూమి పట్టాదారుడు ప్రభాకర్ యాదవ్ అన్నారు. ఈ స్థలం కోసం కొన్ని ఏళ్లుగా ఆయన పోరాడుతున్నారని, దీనిపై లేనిపోనివి అంటగట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. పెద్ద నాయకుడిని విమర్శిస్తే పెద్ద నాయకుడిని అవుతానని అనుకుంటే భ్రమేనన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పులి రజినీకాంత్, గుంటి శ్రీనివాస్, నెక్కొండ కిషన్ పాల్గొన్నారు.

కమీషన్ల కోసమే సెంట్రల్ జైలు స్థలం తాకట్టు

- కల్వకుంట్ల ఫ్యామిలీతో వరంగల్ జిల్లా చరిత్ర కనుమరుగు
- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న కాంగ్రెస్ వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షులు ఎర్రబెల్లి స్వర్ణ, నాయిని రాజేందర్‌రెడ్డి

కాశిబుగ్గ : కల్వకుంట్ల ఫ్యామిలీ వరంగల్ జిల్లా చరిత్రను కనుమరుగు చేస్తోందని కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులతో కలిసి సెంట్రల్ జైలు స్థలంలో నిర్మిస్తున్న మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ జిల్లాను 6 ముక్కలు చేసి, బీఆర్ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేలు నామరూపాలు లేకుండా చేశారని ఆరోపించారు. కమీషన్ల కోసం రాత్రికి రాత్రే సెంట్రల్ జైలును కూల్చి, జైలు స్థలాన్ని కుదువ పెడుతారని ఊహించలేదని పేర్కొన్నారు. అధికారులను బెదిరించి మహారాష్ట్ర బ్యాంకులో రూ.1150 కోట్లు అప్పు తీసుకొచ్చి, రూ.200 కోట్లు జిల్లాకు ఇచ్చి, మిగిలిన రూ.950 కోట్లు ఎత్తుకుపోయారని అందుకు సంబంధించిన పత్రాలను మీడియాకు చూపించారు. చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ తమ్ముడు, రంజిత్‌రెడ్డి, సోదా కిరణ్ ల్యాండ్ కేసులతో సీఐలు సస్పెండ్ అయ్యారన్నారు. ఇక నుంచి రోజుకో కుంభకోణం బయట పెడతామని చెప్పారు. వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ ఈనెల 17న నగరానికి రానున్న మంత్రి కేటీఆర్‌ను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నాయకులు మహ్మద్ అయూబ్, బంక సరళ, పులి అనిల్‌కుమార్, రామకృష్ణ, కూర వెంకట్, ఎంబాడి రవీందర్, చిప్ప వెంకటేశ్వర్లు, తౌటం రవీందర్, అంకుశ్, నల్ల సత్యనారాయణ, సంపత్‌యాదవ్, సంగీత, మనోహర్ పాల్గొన్నారు.

పార్టీకి పునాది ఎన్‌ఎస్‌యూఐ

హన్మకొండ చౌరస్తా : కాంగ్రెస్‌కు పునాది, పట్టుగొమ్మ ఎన్‌ఎస్‌యూఐ అని పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. డీసీసీ భవన్‌లో ఎన్‌ఎస్‌యూఐ ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం జరిగింది. ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ ముఖ్య అతిథిగా హాజరైన ఈ సమావేశంలో నాయిని మాట్లాడారు. ఎన్‌ఎస్‌యూఐ నుంచి వచ్చిన యువత పార్టీని వీడే ప్రసక్తే ఉండదని, క్రమశిక్షణ, పట్టుదలతో ఉంటారని అన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పల్లకొండ సతీష్, నాయకులు పాల్గొన్నారు.

మహిళలకు పెద్దన్నగా ముఖ్యమంత్రి

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- 17న మంత్రి కేటీఆర్ రాకకు ఏర్పాట్లు



మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు, వేదికపై ఇతర ప్రతినిధులు

హన్మకొండ అర్బన్: మహిళా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, వారిని అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం డీసీసీబీ ఆధ్వర్యంలో హనుమకొండ కలెక్టరేట్‌లో నిర్వహించిన మహిళా ఉత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళకు పెద్దన్నగా, అవ్వాతాతలకు పెద్ద కొడుకుగా సీఎం కేసీఆర్ అండగా ఉంటున్నారన్నారు. రూ.110 కోట్ల మేర రుణాలను మహిళా సంఘాలకు అందించడం గొప్ప విషయమన్నారు. ప్రస్తుతం డీసీసీబీ నష్టాలు అధిగమించి రూ.1700 కోట్ల టర్నోవర్‌తో లాభాల్లో ఉందన్నారు. డిపాజిట్లు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. డీసీసీబీ చైర్మన్ రవీందర్‌రావు బ్యాంకు ప్రగతిని వివరించారు. కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య, ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, చల్లా ధర్మారెడ్డి, ఇతర అధికారులు ఉన్నారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలకు చెక్కులు అందజేశారు.

17న మంత్రి కేటీఆర్ రాక

రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఈ నెల 17న వరంగల్ జిల్లా పర్యటన ఖరారైనట్లు మంత్రి తెలిపారు. రూ.416 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, భూమి పూజలు చేస్తారని తెలిపారు. సంగెంలో రూ.800 కోట్లతో టెక్స్‌టైల్ పార్క్‌లో యంగ్‌వన్ కంపెనీ శంకుస్థాపన, తూర్పు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, నూతనంగా నిర్మించే బస్టాండ్, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఇన్నర్ రింగ్ రోడ్డు, ఐడీఓసీ భవనానికి శంకుస్థాపన, జీఓ 58 ద్వారా పట్టాల పంపిణీ ఉంటుందని వివరించారు. అందుకు సంబంధించి విస్తృత ఏర్పాట్లు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

మహిళా అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

- చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్



మహిళా అధికారిని సన్మానిస్తున్న చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్, సీపీ రంగనాథ్

హన్మకొండ : మహిళల రక్షణ, అభ్యున్నతికి బీఆర్ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ కృషిచేస్తున్నారని చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో మహిళా సంక్షేమ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ ముఖ్య అతిథిగా, వరంగల్ పోలీస్ కమిషనర్ రంగనాథ్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. వీరికి బోనాలతో స్వాగతం పలికారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లు, మహిళా, స్త్రీశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశ్రమాల్లో ఆశ్రయం పొందుతున్న బాలికలు చేసిన నృత్యాలు ఎంతగానో అలరించాయి. ఈ సందర్భంగా చీఫ్ విప్ మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ మహిళా సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. సీపీ రంగనాథ్ మాట్లాడుతూ షీ టీమ్ వ్యవస్థ దేశంలోనే ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే ఉందన్నారు. కచ్చితమైన సాక్ష్యాలతో నిందితులను గుర్తించి, కేసు నమోదు చేసి వారికి తగిన కౌన్సెలింగ్ ఇస్తారన్నారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్‌యాదవ్, అధికారులు దర్శన్‌సింగ్, ఝాన్సీలక్ష్మి, మధురిమ, మేన శ్రీను, భద్రునాయక్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, కార్యదర్శి బైరి సోమయ్య, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

పలువురు ఇన్‌స్పెక్టర్ల బదిలీ

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ తోపాటు ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా పలువురు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ మల్టీజోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ వీఆర్ నుంచి వి.వినయ్‌కుమార్ కొత్తగూడెం జిల్లా పాల్వంచ టౌన్ సర్కిల్‌కు, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ టి.రమేష్ కొత్తగూడెం టూ టౌన్, జె.వెంకటరత్నం డోర్నకల్ ఎస్‌హెచ్‌ఓ నుంచి వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు, ఎం.కరుణాకర్ మంచిర్యాల సైబర్ క్రైం నుంచి వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు, కొత్తగూడెం టూ టౌన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న రాజును మహబూబాబాద్ జిల్లా మరిపెడకు బదిలీ చేశారు. మరిపెడలో పనిచేస్తున్న సాగర్‌ను ఐజీ కార్యాలయం అటాచ్డ్ చేశారు. అదేవిధంగా మహబూబాబాద్ డీసీఆర్‌బీలో పనిచేస్తున్న ఫణీందర్‌ను గూడూరుకు, గూడూరులో పనిచేస్తున్న షేక్‌యాసిన్‌ను ఐజీ కార్యాలయానికి అటాచ్డ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. కొత్తగూడెం డీసీఆర్‌బీలో పనిచేస్తున్న ఉపేందర్‌రావును మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌కు, మహబూబాబాద్ సీసీఎస్‌లో పనిచేస్తున్న శ్రీనివాస్‌ను జూలురుపాడుకు, జూలురుపాడులో పనిచేస్తున్న వసంత్‌ను ఐజీ కార్యాలయానికి అటాచ్డ్ చేశారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

● తొలిరోజు 66 మంది విద్యార్థులు డిబార్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో మంగళవారం డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ, బీసీఏ, బీ వోకేషనల్ కోర్సుల రెండో సెమిస్టర్, 6వ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. కాగా, వివిధ పరీక్ష కేంద్రాల్లో కాపీయింగ్ చేస్తూ తొలిరోజే 66 మంది విద్యార్థులు డిబార్ అయ్యారని పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి నరేందర్ తెలిపారు.

ఆర్పీఎఫ్ ఎస్సైపై దాడి

● ముగ్గురి అరెస్ట్

కాజీపేట: కాజీపేట పట్టణంలో రైల్వే రక్షక దళం (ఆర్పీఎఫ్) ఎస్సైపై అకారణంగా దాడి చేసిన ముగ్గురు యువకులను మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు తెలిపారు. విధుల్లో భాగంగా సోమవారం రాత్రి ఫాతిమానగర్ బ్రిడ్జి కింద ట్రాక్ తనిఖీ చేస్తున్న ఎస్సై అంగడి రాజుతో మద్యం సేవిస్తున్న ముగ్గురు యువకులు వాగ్వాదానికి దిగడంతో పాటు దాడి చేశారు. దీనిపై ఎస్సై ఫిర్యాదు మేరకు వరంగల్ జిల్లా గీసుగొండ మండలం మచ్చాపూర్‌కు చెందిన పెరుమాండ్ల మణికంఠ, న్యాడమ్ ప్రశాంత్, కొల ప్రశాంత్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి

దోర్నకల్: వడదెబ్బతో ఓ వ్యక్తి మృతి చెందాడు. పట్టణంలోని సుభాశ్ వీధికి చెందిన కే సుధాకర్ (36) కంటి సంబంధిత సమస్యతో ఇంటి వద్దే ఉంటున్నాడు. 3 రోజుల క్రితం వడదెబ్బకు గురై చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పెద్దాపూర్‌లో గొర్రెల కాపరి..


చేరాలు (ఫైల్)

ఆత్మకూరు : వడదెబ్బతో మండలంలోని పెద్దాపూర్‌కు చెందిన గొర్రెల కాపరి లింగంపెల్లి చేరాలు (65) మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం చేరాలు సోమవారం ఉదయం గొర్రెలను మేత కోసం గ్రామ సమీపంలోకి తీసుకెళ్లాడు. ఈ క్రమంలో వడదెబ్బ తగలడంతో అస్వస్థతకు గురై మంగళవారం ఉదయం మృతి చెందాడు.

విద్యుదాఘాతంతో యువకుడి దుర్మరణం


శ్రీకాంత్‌చారి మృతదేహం

వరంగల్ : విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన సంఘటన ఏనుమాములలోని బాలాజీనగర్‌లో చోటుచేసుకుంది. ఏనుమాముల ఎస్సై పోగుల శ్రీకాంత్ కథనం ప్రకారం.. రాయపర్తి మండలం పెర్కవేడు గ్రామానికి చెందిన శ్రీకాంత్‌చారి (29) కొద్దిరోజుల నుంచి ఎలక్ట్రిసిటీ సబ్ కాంట్రాక్టర్ చలపతిరావు వద్ద లేబర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం బాలాజీనగర్ బొడ్రాయి గల్లీలో విద్యుత్ స్తంభం ఎక్కి లైన్ లాగుతున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై కిందపడి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి రవిబాయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉత్సవం.. ఉత్సాహం..

నూతనోత్తేజంతో తెలంగాణ విద్యాదినోత్సవం

● 20న జిల్లాల్లో అట్టహాసంగా ప్రారంభం
● గ్రామం, పాఠశాల, మండల, జిల్లా స్థాయిలో నిర్వహణ
● ఉత్తమ హెచ్‌ఎంలు, టీచర్లు, ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సన్మానం
● అదేరోజు ఉచిత పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు కూడా పంపిణీ


కాజీపేటలోని ఓ పాఠశాల

విద్యారణ్యపురి : తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో పాఠశాల విద్యాశాఖ ఉత్సాహంగా పాల్గొననుంది. ఇందులో భాగంగా ఈనెల 20వ తేదీన ఉమ్మడి వరంగల్ జిల్లాలో గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో విద్యాదినోత్సవం నిర్వహించనుంది. ఈ విషయమై ఇప్పటికే ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు డీఈవోలు ఆదేశాలు జారీ చేశారు.ఈ నేపథ్యంలో విద్యాదినోత్సవం కార్యక్రమాలను ఇలా నిర్వహించనున్నారు.

గ్రామస్థాయిలో ..

ఈనెల 20వ తేదీన ఉదయం 7.30 నుంచి 8.45 గంటల వరకు గ్రామంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఎస్‌ఎంసీ సభ్యులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులతో సహా ర్యాలీలు నిర్వహిస్తారు. ఇందులో విద్యార్థులు తెలంగాణయోధుల వేషధారణలో పాల్గొంటారు.

మండల స్థాయిలో..

విద్యా దినోత్సవంలో భాగంగా కొత్తగా నిర్మించిన ఎమ్మార్సీలను ప్రారంభిస్తారు. (హనుమకొండ జిల్లాలోని వేలేరు, కాజీపేట, ఐనవోలు, దామెర మండలాల్లోని కేంద్రాలు ప్రారంభమవుతాయి.)

జిల్లాస్థాయిలో..

జిల్లా స్థాయిలో ఈనెల 20వ తేదీన మధ్యాహ్నం 3 గంటల నుంచి అన్ని జిల్లాకేంద్రాల్లో విద్యాదినోత్సవం నిర్వహిస్తారు. కాగా, హనుమకొండ జిల్లా విద్యాదినోత్సవాన్ని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహిస్తారు.

• ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 10మంది ఉత్తమ హెచ్‌ఎంలు, 15 మంది ఉత్తమ ఉపాధ్యాయులు, 5గురు ఉత్తమ తల్లిదండ్రులు, 5గురు ఉత్తమ ఎస్‌ఎంసీ, ఇద్దరు దాతలు, ఉత్తమ ప్రతిభను కనబర్చిన పలువురు విద్యార్థులను సన్మానిస్తారు.
• హనుమకొండ జిల్లాలో పలువురు టీచర్లకు 334 టాబ్‌లు అందించనున్నారు.

పాఠశాల స్థాయిలో..

20వ తేదీన ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు పాఠశాలలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారు.

• తల్లిదండ్రులు, ఎస్‌ఎంసీ, ప్రజాప్రతినిధులను పాఠశాలలకు ఆహ్వానించి జాతీయ పతాకం ఆవిష్కరిస్తారు. అనంతరం ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు..
• 10 సంవత్సరాలలో తెలంగాణ సాధించిన ప్రగతి నివేదికను చదువుతారు. అలాగే, విద్యారంగంలో విద్యాశాఖ సాధించిన విషయాలను కూడా తెలియజేస్తారు. అలాగే, తమ పాఠశాలల ప్రగతి నివేదికతో పాటు భవిష్యత్‌లో పాఠశాల ద్వారా సాధించనున్న లక్ష్యంను వివరిస్తారు.
• విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తారు. పాఠశాలలో రీడింగ్ ఉత్సవం నిర్వహించి తెలంగాణ కవులు, రచయితల గురించి వివరిస్తారు. మన ఊరు -మనబడి పథంలో భాగంగా నిర్మించిన తరగతి గదులను ప్రారంభిస్తారు. అలాగే, విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులను కూడా అదే రోజు అందజేస్తారు.

మార్పును వర్ధన్నపేట నుంచే ప్రారంభిద్దాం

● టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం


మాట్లాడుతున్న కోదండరాం

వర్ధన్నపేట: తెలంగాణను కాపాడుకునేందుకు అందరం ఒకేతాటిపై పని చేద్దామని, మార్పును వర్ధన్నపేట నుంచే ప్రారంభిద్దామని తెలంగాణ జన సమితి పార్టీ(టీజేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం పిలుపునిచ్చారు. 'తెలంగాణ బచావో' సదస్సు సందర్భంగా ప్రొఫెసర్ కోదండరాం, ప్రముఖ కవి అందెశ్రీ మంగళవారం వర్ధన్నపేటకు చేరుకున్నారు. ఈ సందర్భంగా డప్పు చప్పుళ్లు, కోలాటాలతో స్థానిక నేతలు వారికి ఘన స్వాగతం పలికారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మండలంలోని ఉప్పరపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఉన్న కల్యాణ లక్ష్మి గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ ఎందరో ప్రాణత్యాగాలు చేస్తేనే తెలంగాణ ఆవిర్భావించిందని, తెలంగాణ వస్తే అందరి బతుకులు బాగుపడుతాయని ఆశ పడితే.. కేవలం ఆ కుటుంబం కోసమే తెలంగాణ ఏర్పడినట్లుగా ఉందందన్నారు. సీఎం కేసీఆర్ తన చుట్టూ కంచె వేసుకుని బతుకుతున్నాడని, ప్రజల మధ్య ఉండాలన్నారు. తెలంగాణలో విచ్చలవిడిగా మద్యం దుకాణాలు ఏర్పాటు చేసి ప్రజలను బానిసలుగా చేస్తున్నారని మండిపడ్డారు. అందెశ్రీ మాట్లాడుతూ ఓటర్లు కళ్లు తెరవకుండా క్వార్టర్లకు లొంగితే ఎన్నికయ్యే ప్రజాప్రతినిధులకు అడ్డూ అదుపు ఉండదన్నారు. ఓటర్లు షూటర్లు అయినప్పుడే ప్రజాప్రతినిధులకు చుక్కలు కనిపిస్తాయన్నారు. 9 సంవత్సరాలు ఏమి అభివృద్ధి చేశారని దశాబ్ది ఉత్సవాలు చేస్తున్నారని ప్రశ్నించారు.అనంతరం పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ వడ్డేపల్లి విజయకుమార్‌ను పరిచయం చేశారు. ఈ సదస్సులో ఎలిశాల రాజేశ్, ప్రొఫెసర్ వెంకటనారాయణ, నేతలు అంబటి శ్రీనివాస్, డోలి సత్యనారాయణ, రవీందర్, పిల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండొద్దు

● టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు



హన్మకొండ : వినియోగదారులకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్ రావు ఆదేశించారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో జనగామ, హనుమకొండ, భూపాలపల్లి జిల్లా ఎస్ఈలు, డీఈలు, ఎస్ఏఓలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దత్త గ్రామాల్లోని పనులను పూర్తి చేయాలన్నారు. 33/11 కేవీ బ్రేక్ డౌన్స్, అంతరాయాలు, ట్రిప్పింగ్స్ తగ్గించాలన్నారు. బకాయి వసూళ్లు పెంచాలన్నారు. విధిగా లైన్ల పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. సబ్ స్టేషన్ల నిర్వహణ చేపట్టాలన్నారు. వ్యవసాయ సర్వీసులు మంజూరు వేగవంతం చేయాలన్నారు. టీఎస్ఐపాస్, దోభీఘాట్, నాయీబ్రాహ్మణ, లాండ్రీ షాపుల సర్వీసులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. సమావేశంలో డైరెక్టర్లు బి. వెంకటేశ్వర రావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, పి.మోహన్ రెడ్డి, వి.తిరుపతి రెడ్డి, సీజీఎంలు అశోక్ కుమార్, సదర్‌లాల్, మోహన్ రావు, కిషన్, రాజుచౌహాన్, డీఈ (ఐటీ) అనిల్ కుమార్ పాల్గొన్నారు.

భూములు ఆక్రమిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

● అనుచరుల ద్వారా ప్రభుత్వ భూముల అమ్మకం
● ఏఐసీసీ ఆదివాసీ విభాగం జాతీయ ఉపాధ్యక్షుడు బెల్లయ్యనాయక్


మాట్లాడుతున్న బెల్లయ్యనాయక్

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ కబ్జాదారులని, వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను ఆక్రమించి తమ అనుచరుల ద్వారా అమ్మకాలు చేపడుతున్నారని ఏఐసీసీ ఆదివాసీ విభాగం జాతీయ ఉపాధ్యక్షుడు తేజావత్ బెల్లయ్య నాయక్ ఆరోపించారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మహబూబాబాద్‌లో వేలాది ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని రికార్డులు చెబుతున్నాయన్నారు. అయితే బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన అనంతరం ఇక్కడి ప్రభుత్వ భూములపై ఎంపీ, ఎమ్మెల్యే కన్నుపడి యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారన్నారు. ఈ విషయంపై అధికార పార్టీ కౌన్సిలర్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదన్నారు. ప్రభుత్వ భూమిని పరిరక్షించాల్సిన అధికారులు మౌనంగా ఉండడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలోని ఫాతిమా హైస్కూల్ వెనుక గల సర్వే నంబర్ 551లోని 4 ఎకరాల ప్రభుత్వ భూమిలో నెల్లికుదురు జెడ్పీటీసీ మేకపోతుల శ్రీనివాస్‌రెడ్డి రెండెకరాల మేరకు కబ్జా చేసి 55 ప్లాట్లుగా మార్చి ఒక్కొక్కటి రూ. 5 లక్షలకు చొప్పున విక్రయిస్తున్నారని ఆరోపించారు. దౌర్జన్యంతో ప్రభుత్వ భూములన్నీ బినామీ పేర్లతో ఆక్రమించుకుంటున్నారని మండిపడ్డారు. వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, ప్రభుత్వ భూముల్లో పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇస్తామన్నారు. భూకబ్జాలకు పాల్పడిన ఎంపీ, ఎమ్మెల్యే జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. సమావేశంలో జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు, పెరుమాండ్ల గుట్టయ్య, ముల్లంగి ప్రతాప్‌రెడ్డి, గుగులోత్ వెంకటి, బడేటి కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తి నింపేందుకే ఒలింపిక్ డే రన్

● ఈ నెల 18 నుంచి 23వ తేదీ వరకు జిల్లా కేంద్రాల్లో నిర్వహణ
● ఒలింపిక్ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు అజీజ్‌ఖాన్


కమిటీ వివరాలను వెల్లడిస్తున్న అజీజ్‌ఖాన్

వరంగల్ స్పోర్ట్స్: యువతలో క్రీడా స్ఫూర్తిని నింపేందుకే ఏటా ఒలింపిక్ డే సందర్భంగా రన్ నిర్వహిస్తున్నామని ఒలింపిక్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్ అన్నారు. మొదటిసారి కొత్త జిల్లాల ప్రాతిపదికన ఒలింపిక్‌డే రన్ ను నిర్వహించేందుకు ఆయా జిల్లాలో కమిటీలను నియమించినట్లు తెలిపారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండలోని జిల్లా గ్రంథాలయంలో ఒలింపిక్‌డే రన్ నిర్వహణ కమిటీలు, తేదీల వివరాలు వెల్లడించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి కైలాస్‌యాదవ్, ఉపాధ్యక్షులు సతీశ్ , పవన్, కార్యవర్గ సభ్యుడు సృజన్‌కాంత్, మాజీ కార్పొరేటర్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

జనగామ..

ఈ నెల 20వ తేదీన జిల్లా కేంద్రంలో ఉదయం 6.30గంటలకు రన్ కొనసాగుతుందని తెలిపారు. ఒలింపిక్‌డే రన్ నిర్వహణ కమిటీ జిల్లా చైర్మన్‌గా స్థానిక ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, వైస్‌చైర్మన్‌గా డీసీపీ సీతారాం, కన్వీనర్‌గా టి వెంకటేశ్ యాదవ్, కో కన్వీనర్‌గా మనోజ్ కుమార్ వ్యవహరిస్తారని తెలిపారు.

మానుకోట..

జిల్లా కేంద్రంలో 19వ తేదీన నిర్వహించే ఒలింపిక్‌డే రన్ నిర్వహణకు చీఫ్ ప్యాట్రన్‌గా ఎమ్మెల్యే శంకర్ నాయక్, చైర్మన్‌గా కలెక్టర్ శశాంక, వైస్ చైర్మన్‌గా డీఈవో పి రామారావు, కో కన్వీనర్లుగా చాంప్లా నాయక్, డీవైఎస్ఓ అనిల్, సభ్యుడిగా గోగుల రామకృష్ణ వ్యవహరిస్తారని తెలిపారు.

ములుగు..

20వ తేదీన జిల్లా కేంద్రంలో నిర్వహించే ఒలింపిక్‌డే రన్ నిర్వహణ కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్యే సీతక్క, కన్వీనర్‌గా టి వెంకట్రాంరెడ్డి, సభ్యుడిగా పీడీ మలయ్య వ్యవహరిస్తారని తెలిపారు

జయశంకర్ భూపాలపల్లి ..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో 20వ తేదీన నిర్వహించే రన్ నిర్వహణ కమిటీ చైర్మన్‌గా వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, కన్వీనర్‌గా వై సమ్మయ్య, కో కన్వీనగర్‌గా సీహెచ్ రఘు వ్యవహరిస్తారని తెలిపారు.

వరంగల్ / హనుమకొండ..

ఈ నెల 22న వరంగల్, 23వ తేదీన హనుమకొండ, వరంగల్ జిల్లా కేంద్రాలలో నిర్వహించే ఒలింపిక్‌డే రన్ నిర్వహణ కమిటీ చైర్మన్‌గా డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి వ్యవహరిస్తారని తెలిపారు. ఆయన నేతృత్వంలో ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అజీజ్‌ఖాన్, కైలాస్‌యాదవ్ ఆధ్వర్యంలో ర్యాలీ సాగుతుంది.

వరకట్న వేధింపులతో వివాహిత బలవన్మరణం


భూక్య అనిత (ఫైల్)

తరిగొప్పుల: వరకట్న వేధింపులకు తాళలేక ఓ వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మంగళవారం మండలంలోని భోజ్యతండా పరిధిలో జరిగింది. ఎస్సై నరేశ్ కథనం ప్రకారం భోజ్యతండా జీపీలోని రూప్లాతండాకు చెందిన భూక్య అనిల్‌కు, మండలంలోని బొత్తలపర్రె గ్రామానికి చెందిన జరుపుల లక్ష్మణ్ కూతురు అనిత(20)కు రెండు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. పెళ్లి సమయంలో రూ.8 లక్షల కట్నం, కానుకల రూపంలో ముట్టజెప్పారు. ఈ క్రమంలో కొన్ని రోజులుగా అదనపు కట్నం తీసుకురావాలని భర్త అనిల్‌తో పాటు మామ భూక్య రెడ్డి .. అనితను వేధిస్తున్నారు. రోజుమాదిరిగానే సోమవారం కూడా వేధించడంతో మనస్తాపానికి గురైన అనిత అదే రోజు అర్ధరాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దీనిపై మృతురాలి తండ్రి లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, విషయం తెలుసుకున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి, తహసీల్దార్ బాశెట్టి హరిప్రసాద్ ఘటనా స్థలికి చేరుకొని వివరాలు సేకరించారు.

ఆటోడ్రైవర్ సూసైడ్..


శ్రీను(ఫైల్)

సంగెం : కుటుంబ కలహాలతో ఓ ఆటోడ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని చింతలపల్లిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన దండుగుల శ్రీను(30), మౌనిక దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు ప్రణయ్, కన్నయ్య ఉన్నారు. ఈ క్రమంలో కుటుంబ కలహాల నేపథ్యంలో కొంతకాలంగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి.

మూడు రోజుల క్రితం మళ్లీ గొడవపడ్డారు. దీంతో మౌనిక తన ఆడబిడ్డ వల్లెపు శ్రీలత ఇంటికి వెళ్లింది. శ్రీలత.. తమ్ముడు, మరదలుకు సర్ది చెప్పి ఇంటికి పంపించింది. అయితే ఆటో కిరాయికి వెళ్లి వస్తానని చెప్పిన శ్రీను.. మంగళవారం మధ్యాహ్నం తాను ఉరేసుకుంటున్నానని తన అక్క శ్రీలతకు వీడియో కాల్‌లో చేశాడు. శ్రీలత వెంటనే ఇంటి పక్కన ఉంటే చాపర్తి నగేశ్‌కు ఫోన్ చేసి విషయం తెలిపింది. దీంతో నగేశ్ వెళ్లే సరికి శ్రీను ఇంట్లో దూలానికి వేలాడుతూ చనిపోయి ఉన్నాడు. దీనిపై మృతుడి తల్లి ఐలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ చందర్ రావు తెలిపారు.

కీచక బాబా బాగోతం బట్టబయలు

● పూజల పేరుతో మహిళలపై లైంగికదాడులు
● అరెస్టు చేసిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు


అరెస్టు చేసిన దొంగ బాబా, స్వాధీనం చేసుకున్న సామగ్రితో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

వరంగల్: వరంగల్‌నగరంలో కీచక బాబా బాగోతం బట్టబయలైంది. అమాయక ప్రజలను బురిడీ కొట్టిస్తూ.. మహిళలను లైంగికంగా లోబర్చుకుంటున్న దొంగబాబాను వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఏసీపీ జితేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. నగరంలోని ఏనుమాముల ప్రాంతానికి చెందిన షైక్నాలా లబ్బే (58) బాబా అవతారమెత్తాడు. తన మంత్రశక్తులతో కుటుంబంలో ఏమైనా కలహాలు, భార్యాభర్తల తగాదాలు, ఆరోగ్య సమస్యలు ఉంటే నయం చేస్తానని నమ్మించి పలువురు మహిళలు, యువతులను లోబర్చుకున్నాడు. ఈ క్రమంలో ఓ వివాహితపై కన్నేసిన ఆయన.. ఆమెకు తన భర్తతో ఉన్న విభేదాలను దృష్టిలో పెట్టుకొని పూజలు చేస్తున్నట్టు నటించి లైంగికదాడికి పాల్పడ్డాడు. భయపడిన ఆమె విషయం ఇంట్లో చెప్పింది. బాధితురాలితో కలిసి కుటుంబ సభ్యులు టాస్క్‌ఫోర్స్ పోలీసులను ఆశ్రయించారు. రంగంలోకి దిగిన వారు కీచకబాబాను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో ప్రశ్నించగా తన నేరం అంగీకరించినట్లు ఏసీపీ తెలిపారు. తమిళనాడుకు చెందిన షైక్నాలా లబ్బే దాదాపు 40ఏళ్ల క్రితం ఏనుమాముల ప్రాంతంలో స్థిరపడ్డాడని, తాయత్తులతో ప్రజలకు నమ్మకం కలిగించి బాబాగా మారి కీచక పనులు చేస్తున్నట్లు తెలిపారు. అతని నివాసం నుంచి ధారాలు, తాయత్తులు, నిమ్మకాయలు, దిష్టి గురుగులు, వనమూలికలు, నూనె డబ్బాలతోపాటు రూ.25వేలు స్వాధీ నం చేసుకున్నారు. విచారణ నిమిత్తం నిందితుడిని పోలీసులకు అప్పగించారు. దొంగ బాబాను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు కె.శ్రీనివాస్‌రావు, జనార్దన్‌రెడ్డి, ఎస్ఐలు శరత్ కుమార్, లవన్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్ స్వర్ణలత, కానిస్టేబుళ్లు రాజేందర్, కరుణాకర్, శ్రావణ్‌కుమార్, నాగరాజు ను సీపీ అభినందించినట్లు ఏసీపీ తెలిపారు.

పాఠశాలకు వెళ్లమన్నందుకు.. విద్యార్థి ఆత్మహత్య


శివకుమార్ మృతదేహం

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌కు చెందిన మంగ శివకుమార్(14) మంగళవారం బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శివకుమార్ హుస్నాబాద్ గురుకుల పాఠశాలలో 10వ తరగతిలో చేరాడు. తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లమని చెప్పినందుకే క్షణికావేశంతో బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. కాగా, విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూరాబాద్ మార్చురీకి తరలించారు.

బాలాజీనగర్‌లో మరొకరు..

వరంగల్ : ఏనుమాముల పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాలాజీనగర్‌లో ఇంటర్ విద్యార్థి కొండపల్లి వినయ్(18) సోమవారం సాయంత్రం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ పోగుల శ్రీకాంత్ తెలిపారు. వినయ్ కొంతకాలంగా నిరంతరం సెల్‌ఫోన్‌లో గేమ్స్ ఆడుతుండగా తల్లి యాదలక్ష్మి మందలించింది. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో వినయ్ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. దీనిపై తండ్రి రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నియోజకవర్గాలను మార్చేశారు.!

● బీసీ రుణ వెబ్‌సైట్‌లో గందరగోళం



బయ్యారం: బీసీ రుణాలు పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన వెబ్‌సైట్‌లో ఒక నియోజకవర్గ పరిధిలో ఉన్న మండలాలను ఇతర నియోజకవర్గాల్లో చేర్చి గందరగోళపరుస్తున్నారు. మహబూబాబాద్ జిల్లాలోని బయ్యారం మండలం ఇల్లందు నియోజకవర్గం, గూడూరు.. మహబూబాబాద్, కొత్తగూడ, గంగారం మండలాలు ములుగు నియోజకవర్గ పరిధిలో ఉన్నాయి. కానీ బీసీ రుణాల వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ చేసేటప్పుడు బయ్యారం మండలం మంథని, గూడూరు, కొత్తగూడ, గంగారం మండలాలు నర్సంపేట నియోజకవర్గపరిధిలో కనిపిస్తున్నాయి. మరోవైపు ములుగు నియోజకవర్గంలో ఉన్న కొత్తగూడ మండలాన్ని కొత్తగూడెంగా మార్చి ములుగు నియోజకవర్గంలో చేర్చారు. ఇలా వేర్వేరు నియోజకవర్గపరిధిలో మండలాలను చేర్చడంతో దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. మహబూబాబాద్ జిల్లాలో కొత్తగా ఏర్పడిన సీరోలు, ఇనుగుర్తి మండలాలకు రుణవెబ్‌సైట్‌లో చోటు కల్పించకపోవటంతో ఉమ్మడి మండలం పేరునే వివరాలు నమోదు చేయాల్సి వస్తుంది.

స్వచ్ఛ వరంగల్‌లో భాగస్వామ్యం కావాలి


పట్టణ పారిశుధ్య ప్రగతి సమాచార కరదీపికను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

● స్వచ్ఛ వరంగల్ పౌరసంఘాల వేదిక కోకన్వీనర్ అనితారెడ్డి

కాజీపేట రూరల్ : స్వచ్ఛ వరంగల్‌లో ప్రజలు భాగస్వాములు కావాలని స్వచ్ఛ వరంగల్ పౌర సంఘాల వేదిక కోకన్వీనర్ కె.అనితారెడ్డి సూచించారు. కాజీపేటలోని బాలవికాస పీపుల్స్ ట్రైనింగ్ సెంటర్‌లో పలు కాలనీలు, అపార్ట్‌మెంట్లు, ప్రజా సంఘాల ప్రతినిధులతో స్వచ్ఛ వరంగల్‌పై మంగళవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అనితారెడ్డి మాట్లాడుతూ బాధ్యత ఉన్నప్పుడే హక్కుల కోసం మాట్లాడే అధికారం ఉంటుందని పేర్కొన్నారు. మారి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.మురళి పౌర సంఘాల వేదిక సభ్యులు, నగరపాలక సంస్థ అధికారులు కలిసి మెరుగైన పారిశుద్ధ్య కోసం పలు సూచనలు చేశారు. ఆస్కీ సంస్థ అసోసియేట్ ప్రొఫెసర్ ఎం.స్నేహలత మాట్లాడుతూ అన్ని డివిజన్ల సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేసుకుని స్వచ్ఛ నగరం కోసం నిరంతరం కృషి చేయాలని కోరారు. మహిళలు, యువకులు, కాలనీవాసులు, అపార్ట్‌మెంట్ సంఘాలు, వాకర్స్ అసోసియేషన్, లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్, యువజన సంఘాల సభ్యులు, మహిళా సంఘాలు మెరుగైన పారిశుద్ధ్యం కోసం సంఘటితంగా పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు. మారి, ఆస్కీ సంస్థలు అందించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఆదర్శకాలనీ ప్రధాన కార్యదర్శి పరికి పండ్ల వేణు వివరించారు. వరంగల్ పట్టణ పారిశుద్ధ్య ప్రగతిలో సంక్షేమ సంఘాలు, పౌరసంఘాల పాత్ర, మార్గదర్శక సమాచార పుస్తకాన్ని ఆవిష్కరించి పంపిణీ చేశారు. వల్లంపట్ల నాగేశ్వర్‌రావు, ప్రొఫెసర్ రతన్‌సింగ్‌ఠాకూర్, డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, కవిత, మండల పరశురాములు, రాజమోహన్, ఓంప్రకాష్, నిమ్మల శ్రీనివాస్, బాల్నె శరత్‌బాబు, శంకర్‌రావు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.